# 2

# యరోబాము (2)

# మత సంబంధమైన పాపి

*మూల వాక్యము: 1 రాజులు 11:26-39; 12:1-14:20*

కుటుంబాలకు, పట్టణాలకు, దేశాలకు సంబంధించి మంచికిగాని, చెడ్డకుగాని, మానవ వ్యవహారాల గుమనాన్ని తరచుగా ఒక మనిషియే నిశ్చయించినట్టు చరిత్ర సాక్ష్యమిస్తుంది.[1] "అది అన్యాయం" అని నీవు అనవచ్చు. "ఒక్క మనిషికి అంత పెద్ద పలుకుబడి యివ్వకూడదు, ఇతరుల జోక్యం లేకుండగనే ప్రతి వ్యక్తి తన గమ్యాన్ని తీర్మానించుకొననిమ్ము" అని నీవు అంటావు. నీవు అనేది రైటు; దేవుడు మనలను ఆ రూపంగానే నిర్మించాడు. అయినా, మనుష్యులు మరియు దేశాలు ఆలోచన లేకుండగనే నాగరికత ప్రవాహాలకు, జీవిత వైఖరులతో కొట్టుకొనిపోతారు. అధికారంలో ఉన్నవారు దేవుని వాక్యంతో ఆత్మ పరిశోధన లేకుండగనే నిర్ణయాలు తీసికొంటారు. తత్ ఫలితంగా, నాయకుల చేతుల్లో తరచుగా జనులు కీలుబొమ్మలౌతారు. తక్కువ ప్రతిఘటనా మార్గాలు అవిధేయులైనవారి వంకర టింకర నదులుగా మారిపోతాయి. ఇతరుల భావాలకు మనం యిష్టపూర్వకంగా లోబరచుకొంటాం. బందీలమౌతాం. దేవుడు మనకు ప్రసాదించిన స్వాతంత్ర్యాన్ని సరిగా ఉపయోగించుకోలేకపోతాం.

యరోబామును తమకు రాజుగా నిర్ణయించుకొన్నందుకు ఇశ్రాయేలీయులు తమ్మునుతాము అభినందించుకొని ఉంటారు. మంచి రాజుగా ఉండడానికి కావలసిన లక్షణాలు – ప్రజ్ఞ, యితరుల అభిమానాన్ని చూరగొనే ప్రభావము, నమ్మిక, సహజమైన నాయకత్వపు నైపుణ్యాలు ఉన్నాయి. నూతన రాజ్యానికి యింతకంటె శ్రేష్ఠమైన ఏర్పాటు లేకపోవచ్చు! యువకుడైన యరోబాముతో, వారి భవిష్యత్తు తేజస్సుగాను, ఆహ్వానించునది గాను ఉంది. అలా అని వారు తలంచారు.

రాజ్యము ఎన్నడూ కోలుకోలేని నీచ స్థితికి, వారి అతిశయాస్పదంతో కోరుకొన్న యరోబాము వారిని నడిపిస్తాడని వారికి ఏ గ్రహింపు లేకుండపోయింది. యరోబాము 22 సంవత్సరాలు ఏలుబడి చేశాడు (క్రీ.శ. 931-910),[2] కాని ఆ సంవత్సరాలు ఇశ్రాయేలుకు మృత తుల్యమైనవై ఉన్నాయి.

ప్రకాశవంతమైన విజయంగా అతడుంటాడని ప్రతివారు ఎదురు చూచిన దానికి భిన్నంగా, యరోబాము సంపూర్ణమైన ఓటమిగా నిలిచిపోయాడు. అతడు దేనికైనా జ్ఞాపకం చేసికొనబడితే, అది అతడు దేశాన్ని పాపంలోనికి దించాడు అనే ఒక్కదానికే. ఈ భావంలో, అతడు అపవాది యొక్క వీరుడైయుంటాడు. అతడు కాదను అవుననువాటి విచిత్ర

సమ్మేళనమైయున్నాడు. అతడు మత సంబంధమైన పాపి. సహజంగా ఒకడు మతస్థుడైతే పాపిగా భావించబడడు; అతడు పాపియైతే, అతడు మతస్థుడుగా ఎంచబడడు. ఏదియెలాగున్నా, యరోబాము రెండునైయున్నాడు. అందునుబట్టియే దేవుని ఎదుట అతని జీవితం అసహ్యించబడింది. అతడు పాపం చేసినట్టును, ఇశ్రాయేలు పాపం చేయడానికి కారకుడైనట్టును యరోబామును గూర్చి ఇరువదియైదు సార్లు చెప్పబడింది. ఎవరికై, ఆమె లేక అతని జీవితంపై, అలాటి విలాసం వ్రాయబడడం ఎంత భయంకరమై ఉంటుంది!

ఎక్కువ సూటిగా చెప్పాలంటే అతని పాపం ఏమైయుంది? ఇంతకు యరోబాము చేసిన పని ఏమి? అతడు అంతగా ఎందుకు విఫలమయ్యాడు?

## పాపము నిర్వచింపబడింది

ఆ ప్రశ్నకు మనం బదులు చెప్పకముందు, పాపాన్ని మనం రెండు విశాలమైన వర్గాలుగా విభాగించితే సహాయపడవచ్చు: నైతిక పాపాలు, మత సంబంధమైన పాపాలు. బైబిలు ఆలాటి విభజనను ఎక్కడే చేయలేదు. యరోబాము ఏలాటి పాపం విషయంలో దోషియయ్యాడో తేటపరచడానికి మాత్రమే ఈ ప్రయత్నం చేయబడింది.

నైతిక పాపాలు, పాపాలు ఎందుకంటే అవి యితరులను గాయపరచే లేక మనలను గాయపరచే తప్పులైయున్నాయి. అవి నిరోధించబడ్డాయి గనుక అవి హానికరమైనవిగా లేవు; *అవి హానికరమైనవి గనుక నిరోధించబడ్డాయి.* ప్రేమగల తండ్రిగా దేవుడు, మన క్షేమాన్ని గూర్చి శ్రద్ధ వహిస్తాడు. మన మనస్సును, మనస్సాక్షిని, శరీరాన్ని, వ్యక్తిని బాధించే, హానిచేసే స్వభావాలను, చర్యలను మన మేలు కోరి ఆయన నిషేధించుతుంటాడు. పరిమితియైన మన వివేకము స్వేచ్ఛగా ఉపయోగించబడినప్పుడు, నరునికి హానిచేసినా లేక చెరచినా, దాన్ని పాపంగా భావించాలని మనం తీర్మానిస్తాం.

మత సంబంధమైన పాపములంటే స్పష్టమైన దేవుని ఆజ్ఞలను అతిక్రమించే తప్పులు. *అవి నిషేధించబడ్డాయి గనుక అవి హానికరములు;* అవి హానికరమైనవైనందున నిషేధించబడలేదు. దేవుడు సర్వాధిపతి. ఆయనను మనం ఎలా ఆరాధించాలో, సేవించాలో, ప్రాతినిధ్యం యివ్వాలో ఆయన మనకు తెలుపుతాడు. ఆయన ఆదేశాలకు తన హేతువులను ఎల్లవేళలా యివ్వకపోవచ్చు. కాని మనం లోబడాలని ఆయన ఆజ్ఞాపిస్తారు. ఉదాహరణకు, ప్రత్యక్షగుడారపు ఆరాధనలో లేవీయకాండం 10లో ఏ రకమైన అగ్నిని ఉపయోగించాలో ఆయన నాదాబు అబీహులకు తెలియజేశాడు. వారికి ఆయన చట్టం తెలుసు, కాని అల్పంగా ఎంచుకున్నారు, అలక్ష్యం చేశారు, దాన్ని వదిలిపెట్టారు. ఆయన ఆదేశాలను అనుసరించడంలో తప్పిపోయినందున నాశనకరమైన ఫలితాలు వచ్చాయి.

> అహరోను కుమారులైన నాదాబు అబీహులు తమ తమ ధూపార్తులను తీసికొని వాటిలో నిప్పులుంచి వాటిమీద ధూపద్రవ్యమువేసి, యెహోవా తమకాజ్ఞాపింపని వేరొక అగ్నిని ఆయన సన్నిధికి తేగా యెహోవా సన్నిధినుండి అగ్ని బయలుదేరి వారిని కాల్చివేసెను; వారు యెహోవా సన్నిధిని మృతిబొందిరి (లేవీయకాండము 10:1, 2).

నైతిక పాపములుగా తలంచబడే హత్య, దొంగతనము, లేక సొల్లు కబుర్లతో నాదాబు అబీహులు దోషులు కారు. వారు కేవలం దేవుని ఆదేశాలను అలక్ష్యం చేశారు. ఆయన గైడ్‌లైన్స్‌ను వారు ఒక ప్రక్కనుంచారు. ఆయన కావాలని కోరినదాన్ని వారు నిరాకరించారు. వారు మత సంబంధమైన పాపం చేశారేగాని నైతికమయ్యింది కాదు. "దేవుడు ఆజ్ఞాపించిన దానికంటె వేరేది తెచ్చినందున ఏ హాని కలుగుతుంది?" అని ఎవరైనా వాదించవచ్చు. "అది ఎవరిని బాధించేది కాదు. అది హాని చేయని కల్పితం, నడుచరీతిలో మార్పు, ఒక నూతన విధానమైయుంది." అభిప్రాయాలకు సంబంధించిన వాటికంటెను వారి చర్యలు లోతుగా వెళ్లిపోయాయ్. దేవుని చిత్తాన్ని నిరాకరించే పాపాన్ని వారు చేశారు. వారు అవిధేయులైయున్నారు. వారు దేవుని స్థానంలో తమ్మును పెట్టుకున్నారు. "దేవుని ఎలా ఆరాధించాలో మనం నిర్ణయాలు చేద్దాం" అని వారు తమ చర్యలవలన తెలిపారు.

అప్పుడు, నైతిక పాపానికి, మత సంబంధమైన పాపానికి మధ్యగల వ్యత్యాసం తేటపడుతుంది. నైతిక పాపాన్ని నిషేధించడంలో హేతువు యితరులకు హాని చేయకూడదు లేక మనకు హాని చేసికోకూడదు అనేది. మత సంబంధమైన పాపము చేయకూడదు అనడం వెనుకనున్న విశేషం దేవుడు గౌరవించబడాలి ఆయనకు లోబడాలి అనేది.

యరోబాము యొక్క ఘోరమైన తప్పు మతపరమైనది గాని నైతికపరమయ్యింది కాదు. మనష్షేవలె అతడు అమాయకపు జనులను చంపలేదు (2 రాజులు 21:16). అతడు దావీదువలె అవినీతి కార్యం జరిగించలేదు (2 సమూయేలు 11:1-5); సౌలువలె అతడు మాట తప్పలేదు (1 సమూయేలు 15:17-22). కానప్పటికిని, అతడు మోషే ధర్మశాస్త్రమును నిరాకరించాడు; అతడు మత సంబంధమైన తన సొంత చట్టాలను చేశాడు, జనులు వాటికి లోబడేలా చూచాడు.

## పాపము వర్ణింపబడింది

సింహాసనాన్ని అధిష్టించిన కొద్ది కాలంలోనే, అతనికి యివ్వబడిన హెచ్చరికను యరోబాము యిటు అటు కదిల్చివేసి (విర్రవీగి) మత సంబంధమైన అవిధేయతతో సంపూర్ణంగా మునిగిపోయాడు. మొట్టమొదట బేతేలు - దాను అనే చోట్ల నూతన ఆరాధనా కేంద్రాలను స్థాపించాడు. బేతేలు యెరూషలేమునకు ఎనిమిది మైళ్ల లోపుగా ఉంటుంది - యిది ఇశ్రాయేలులో దక్షిణ భాగాన ఉంటుంది. దాను పాలస్తీనాకు ఉత్తరపు కొనలో ఉంటుంది.

> "యెరూషలేమునకు పోవుట మీకు బహు కష్టము"; ఇశ్రాయేలువారలారా, ఐగుప్తుదేశములో నుండి మిమ్మును రప్పించిన మీ దేవుడు ఇవే అని చెప్పి, ఒకటి బేతేలునందును, ఒకటి దానునందును ఉంచెను (12:28, 29).

రాజ్యము చీలిపోయినప్పుడు,దక్షిణపు రాజ్యానికి ఆత్మ సంబంధమైన ఆరాధనా స్థలమైన యెరూషలేము దక్కింది. ఆయనను ఆరాధించడానికి దేవుని ప్రజలు యెరూషలేమునకు సంవత్సరానికి ముమ్మారు వెళ్లాలి (నిర్గమకాండము 23:17). అలాటప్పుడు యరోబాము

తనకు తానే ఒక ప్రశ్న వేసికోవాలి: "జనులు యెరూషలేమునకు వెళ్లి ఆరాధించవలసిన సంగతి ఏమి? వారు యెరూషలేమునకు వెళ్లినట్టయితే, వారు అక్కడే ఉండగోరవచ్చు. నేను రాజ్యాన్ని పోగొట్టుకోవచ్చు." ఈ ప్రశ్నను అతడు ఎలా చేబూనాడు? దేవునికి విధేయతగా ప్రజలు యెరూషలేమునకు వెళ్లాలని అతడు కోరతాడా లేక దేవుని ధర్మశాస్త్రాన్ని రద్దుపరచి, జనులు యెరూషలేము పోనవసరం లేని క్రొత్త ఆరాధనా విధానాన్ని అతడేదైనా ఏర్పాటు చేస్తాడా? అది ప్రాముఖ్యమైన తీర్మానం. దేశమంతా అతని నడిపింపుకు వేచియుంది. దీనికి నీతి నిజాయితి, దృఢనమ్మిక, సరియైన నిర్ణయం తీసికొనడానికి ధైర్యం కావాలి. దేవునికి సంపూర్ణమైన అవిధేయతలో, దేవుని ఆరాధించుటకు యెరూషలేము వెళ్లుట బహు దూరం, ప్రజలకు బహు ప్రయాస అనే వేషంలో, యరోబాము నూతన ఆరాధనా కేంద్రాలను ఏర్పాటు చేశాడు.

యరోబాము యింకను ముందుకు వెళ్లి, ఆరాధనకు క్రొత్త వస్తువులను ఏర్పరచాడు: బంగారు దూడలు.

> యరోబాము ... ఆలోచనచేసి రెండు బంగారపు దూడలు చేయించి, జనులను పిలిచి "– ఇశ్రాయేలువారలారా, ఐగుప్తు దేశములోనుండి మిమ్మును రప్పించిన మీ దేవుడు ఇవే అని చెప్పి ..." (12:28, 29ఎ).

యెహోవాను యథార్థముగాను, నమ్మకముగాను ఆరాధించేవానికి ఈలాటి కార్యము యోచనకే రాదు. ఈలాటి యుక్తి యొక్క దోషమేమో యరోబాముకును, ఇశ్రాయేలుకును తెలిసినదే. ఎందుకంటె సీనాయి కొండ దిగువ భాగంలో అహరోనుచే నడిపింపబడిన జనులు బంగారు దూడను చేసికొన్నప్పుడు జరిగిన సంగతి వారికి తెలుసు (నిర్గమకాండము 32:1–6). పది ఆజ్ఞలతో మోషే కొండపైనుండి దిగేలోగా, అప్పటికే ఇశ్రాయేలు వాటిలో కొన్నింటిని అతిక్రమించింది. యెహోవా ఆరాధనకు ఈ దూడలు దృశ్యమైన గురుతులుగా యరోబాము ఉండగోరవచ్చు – యెహోవా ఆరాధన స్థానంలో వీటిని ఉంచాలనే యోచన లేకపోవచ్చు అదే నిజమైనా, అలాటి దూడల నిర్మాణం పూర్ణంగా అధికార రాహిత్యమైనదియు, రెండవ ఆజ్ఞను అతిక్రమించినదైయుంది.

ఈ క్రొత్త కల్పనలతో యరోబాము చాలించలేదు. అతడు బలిపీఠపు సమస్యను ఎదుర్కొన్నాడు. నోవహు, అబ్రాహాము, మోషే దినాల్లోనుండి బలులు అర్పించడం ఇశ్రాయేలీయుల మనస్సుల్లో నాటుకుపోయింది. దేవునికి బలులు అర్పించాలని ఇశ్రాయేలు పట్టుదల గలిగియుంది. యరోబాము ఆరాధనా స్థలాలను ఏర్పాటు చేసి బలులు అర్పించడానికి నూతన బలిపీఠాలను ఏర్పరచుకుంటే, ఇశ్రాయేలులోని తన ప్రజలను అతడు తృప్తిపరచేవాడు కాడు. వారు తమ బలులు అర్పించడానికి యింకను యెరూషలేము వెళ్లగోరేవారే.

అతని సమస్యకు మరొక వర్తింపు ఏమంటే – ఇశ్రాయేలీయులందరికి బలియర్పించు స్థలం యెరూషలేమైయున్నట్టు దేవుడు ప్రత్యేకంగా సూచించాడు. క్రొత్త బలిపీఠాలు ఏర్పాటు చేయడం దేవునికి నేరుగా అవిధేయతయే ఔతుంది. యరోబాము సందిగ్ధాన్ని ఎదుర్కొంటున్నాడు: క్రొత్త బలిపీఠాలను నిర్మించి దేవునికి అవిధేయుడు కావాలా, లేక

బలులు అర్పించడానికి తన ప్రజలు యెరూషలేమునకు వెళ్లినప్పుడు యూదాకు జనులను పోగొట్టుకోవాలా? అతడేమి చేశాడు? అతడు క్రొత్త బలిపీఠాలను కట్టగోరాడు. అతని నూతన ఆరాధనా స్థలాలు సంపూర్ణమైనవిగా కన్పించాయి – క్రొత్త బలిపీఠాలతో సహా యెరూషలేమునకు కలిగినవన్నీ యిక్కడ ఉన్నాయి. "బేతేలులో తాను చేయించిన బలిపీఠం మీద అతడు స్వయంగా బలులు అర్పించసాగాడు" (12:33). అతడు తిరిగి రాలేనంతగా తన క్రొత్త మతంలో అతడు ముందుకు సాగాడు – దేవుని చిత్తం ఏమైయున్నా అతడు క్రొత్త బలిపీఠాలను కట్టాడు. ఒక పాపం మరియొక దానికి దారితీసింది.

నాల్గవది, యరోబాము క్రొత్త యాజక క్రమాన్ని ఏర్పాటు చేశాడు. "మరియు అతడు ఉన్నత స్థలములను కట్టించి మందిరముగా ఏర్పరచి, లేవీయులు కాని సాధారణమైన వారిలో కొందరిని యాజకులుగా నియమించెను" (12:31). అబ్రాహాము యింటివారిలో నుండి వచ్చిన లేవీయులు మాత్రమే యాజకులుగా పని చేయునట్లు దేవుడు నియమించాడు (2 దినవృత్తాంతములు 13:10). ఈ నూతన ఆరాధనా కేంద్రాలలో పని చేయడానికి నిజమైన యాజకులను ఏర్పరచడం యరోబాముకు సమస్యగా ఉండేదే. అలా ఎందుకు? వారు దేవుని వాక్యాన్ని గౌరవించినవారైయుంటే, అంతటి ఘోరమైన దుష్కార్యము చేయడానికి వారు భయపడి వెనుకకు తగ్గేవారే (2 దినవృత్తాంతములు 13:9). అందునుబట్టి యరోబాము తన సొంత యాజక తరగతిని ఏర్పాటు చేసికొని, అది ఎంతటి పాపమైనా లక్ష్యం చేయకుండ రాజు ఆజ్ఞను నెరవేర్చేవారిని 11 గోత్రాల్లోనుండి అతడు ఏరుకున్నాడు.

అయిదవది, అతడు వార్షికంగా జరిగే క్రొత్త పండుగను ఏర్పరచి మత సంబంధమైన క్యాలెండరును మార్చివేశాడు:

> ఈ ప్రకారము అతడు యోచించినదానినిబట్టి యెనిమిదవ మాసము పదునైదవ దినమందు బేతేలులో తాను చేయించిన బలిపీఠము మీద బలులు అర్పించుచు వచ్చెను; మరియు ఇశ్రాయేలువారికి ఒక ఉత్సవమును నిర్ణయించి ధూపము వేయుటకై తానే బలిపీఠము ఎక్కెను (12:33).

మత సంబంధమైన సంవత్సరానికి మోషే ధర్మశాస్త్రమందు ఏడవనెల ప్రాముఖ్యమయ్యింది: మొదటి దినము అందులో జ్ఞాపకార్థ శృంగ ధ్వని చేయబడుతుంది (లేవీయకాండము 23:23–25), పదియవ దినము ప్రాయశ్చిత్తార్థ దినము (లేవీయకాండము 23:27), మరియు పదునయిదవ దినమునుండి ఇరవై రెండవ దినమువరకు పర్ణశాలల పండుగ (లేవీయకాండము 23:33–36). యరోబాము మత సంబంధమైన క్యాలండరును కేవలం ఒక్క నెల ముందుకు త్రోశాడు, ఎనిమిదవ నెల పదునయిదవ దినంగా దాన్ని నిర్ణయించాడు. "అతడు యోచించిన దానిని బట్టి" ఎనిమిదవ నెలను అతడు నిర్ణయించినట్టు బైబిలు అంటుంది (12:33).

ఇలా మార్చి, తిరిగి అమర్చినదాని ఫలితంగా వచ్చింది యరోబాము మతమేగాని దేవునిది కాదు. యరోబాము దేవుని చిత్తాన్ని వెదకడం లేదు; అతడు తన సొంత హృదయాలోచనను వెంబడిస్తున్నాడు. జాతీయ నాయకుడుగా అతడు పూర్తిగా

విఫలుడయ్యాడు. అతడు దేవుని ప్రతినిధిగా ఉండి, దేవుని చిత్తం జరిగించేలా జనులను నడిపించవలసినవాడు – కాని తానే యొక దేవతగా మారిపోయి, ప్రజలను తన సొంత యిష్టప్రకారము నడిపించగోరాడు.

సాతాను నిజంగా మతాన్ని తీసివేయాలని ప్రయత్నించడు; కాని దైవ మార్గానికి మారుగా దాని స్థానంలో మానవ మతాన్ని ప్రవేశపెట్టాలని – మనుష్యులు అంగీకరించాలని ప్రేరేపిస్తాడు. యరోబాము అపేక్షించదగినవాడుగా, న్యాయంగా కన్పించేవాడుగా, ఆచరణకు తగినవాడన్నట్టు గోచరిస్తాడు. అతడు చేసేదానియంతటిలో ఒకటి మాత్రం తప్పక తప్పు అయ్యింది – దేవుని చిత్తాన్ని ఎత్తివేసి దాని స్థానంలో తన చిత్తాన్ని పెడుతున్నాడు!

## పాపము ఆక్షేపింపబడింది

తన సొంత మతాన్ని ఏర్పరచుకొని దానిని అనుసరించేలా జనులను నడిపించడం అనే యరోబాము పాపము దేవునిచే తేటగా ఆక్షేపించబడింది (తప్పుపట్టబడింది). వాస్తవానికి, విచిత్రంగా జరిగిన ఈ క్రింది మూడు సంఘటనలు ఆయన వాక్యానికే లోబడాలని యెహోవా ప్రకటించాడు.

### బహిరంగమైన గద్దింపు ద్వారా

తాను రూపించిన, స్థాపించిన ఎనిమిదవనెల పదునైదవ దినమున పండుగ నాచరించడానికి యరోబాము బేతేలునకు వెళ్లాడు. కఠోరమైన అవిధేయత, భయభక్తిలేని అహంభావంతో, తాను కట్టించిన బలిపీఠం మీద ధూపం వేయడానికి అతడు వెళ్లాడు (12:33). తనకు ఆశ్చర్యం కలిగించేలా, జనుల గుంపులోనుండి ఒక దైవజనుడు ముందుకు వచ్చాడు, అతడు యూదా దేశంనుండి వచ్చిన కరుకైన ప్రవక్త, తన పెదవుల మీద తీర్పు పలుకులున్నాయి. ఆ ప్రవక్త తన వ్రేలిని ఆ బలిపీఠమువైపు చూపి, దేవుని తీర్పును అతడు ప్రకటిస్తుండగా, కూడియున్నవారి మధ్య కలకలము సద్దణగిపోయింది, కార్యనిర్వాహకుల మధ్య భీతినికొల్పే నిశ్శబ్దం కమ్ముకొంది:

> బలిపీఠమా బలిపీఠమా, యెహోవా సెలవిచ్చునదేమనగా – దావీదు సంతతిలో యోషీయా అను నొక శిశువు పుట్టును; నీమీద ధూపము వేసిన ఉన్నత స్థలము యొక్క యాజకులను అతడు నీమీద అర్పించును; అతడు మనుష్య శల్యములను నీమీద దహనము చేయును (13:2).

ఈ బలిపీఠం మీద బలులను ఎవరు అర్పించారో, ఆ అబద్ధ యాజకుల ఎముకలు ఒకనాడు దహించబడే స్థలం యరోబాము కట్టించిన బలిపీఠమైయుంటుంది. ఈ ప్రవచనంలో యోషీయా పేరుతో ప్రస్తావించబడ్డాడు. గనుక దీనిని మనం "పేరు ప్రవచనం" అని అంటాం. ఎవని ఏలుబడి కాలంలో ఆ బలిపీఠం అపవిత్రపరచబడుతుందో ఆ ప్రత్యేకమైన వ్యక్తి యొక్క పేరు ముందుగా చెప్పబడింది. యోషీయా అనే మంచి రాజు యొక్క ఏలుబడి కాలంలో, మూడు వందల సంవత్సరాల తరువాత ఈ ప్రవచనం

నెరవేర్చబడింది (2 రాజులు 23:20). దానికిగాను ప్రవక్త ఈ సూచననిచ్చాడు: "ఈ బలిపీఠము బద్దలైపోయి దానిమీదనున్న బుగ్గి ఒలికి పోవుటయే యెహోవా ఇచ్చు సూచన" అని చెప్పాడు (13:3). ఆ ప్రవచనానికి దాని సొంతమైన అధికారిక సూచన ఉంది. దానికి రుజువు వెంటనే యివ్వబడింది.

యరొబాము తన చెయ్యి చాపి "వానిని పట్టుకొనుమని" చెప్పాడు! "అతడు చాపిన చెయ్యి యెండిపోయెను" (13:4). ఆ ప్రవక్తను పంపింది దేవుడేయని, అతడు సత్యాన్ని పలికాడని, దేవునిచే యరొబాము గద్దింపబడ్డాడని బహిరంగంగా సాక్ష్యమియ్యబడింది. వెంటనే బలిపీఠం పగిలింది, బుగ్గి ఒలికిపోయింది. దేవుని తీర్పు యొక్క శక్తిచే వికలాంగుడుగా చేయబడినవాడై, తన చేయి బాగుపడునట్లు యరొబాము మనవి చేసికొన్నాడు. దేవుని అద్భుతమైన కనికరపు ప్రదర్శనగా, అతని చేయి బాగుపడునట్లు ప్రవక్త దేవుని ప్రార్థన చేస్తాడు. అతని మనవి అంగీకరింపబడింది (13:6). దేవుడు ఎల్లవేళల రెండవ తరుణం (అవకాశం) అనుగ్రహించే దేవుడైయున్నాడు. మారుమనస్సు పొందునట్లు పరిస్థితులు కల్పించబడడంవలన యరొబాముకు అవకాశం యివ్వబడింది. "దాదాపుగా మారిపోయినట్టు" యరొబాము ప్రవక్తను తన యింట భోజనం చేసి విశ్రాంతి తీసికొన నాహ్వానిస్తాడు. ఆ పట్టణంలో ఎవని యింటను భోజనం చేయకూడదని వచ్చిన మార్గాన తిరిగి పోకూడదని తనకు సెలవైనట్టు ఆ దైవజనుడు తెలుపుతాడు. ఇక్కడ ఒక అరుదైన మణి మాణిక్యముందు – రాజుతో భోజనం చేసే అవకాశాన్ని (ఆహ్వానాన్ని) తిప్పికొట్టిన ప్రవక్త! యరొబాము తన అవిధేయతను గూర్చి తలంచాడంటే సందేహపడ నక్కరలేదు, కాని నీతివైపు అతడు మొగ్గుచూపింది ఎక్కువసేపు నిలిచినట్టు లేదు. యరొబాము యొక్క మత సంబంధమైన పాపాన్ని దేవుడు అసహ్యించుకొన్నాడన దానికి తొలి పలుకు ప్రవక్త యొక్క గద్దింపే.

### ప్రవక్త యొక్క మరణం ద్వారా

ఆ దినాన తప్పని చేసే మరొకరకమైన ఆక్షేపణ తరువాత వచ్చింది. యూదానుండి వచ్చిన ప్రవక్త ఆ ఊరిలోని ఒక ముసలి ప్రవక్తచే మోసగించబడ్డాడు. తనకు యివ్వబడిన దైవికమైన ఆదేశాన్ని అతడు అతిక్రమించి, ముసలి ప్రవక్త యింట అతడు భోజనంచేసి, ప్రయాణం చేస్తుండగా అతడు సింహంచేత చంపబడ్డాడు (13:23–26). (మన తరువాత పాఠంలో దీన్ని సవివరంగా మనం చదువబోతాం.) చిన్న తప్పుగా కన్పించిందే తన మరణానికి హేతువైయ్యింది. త్రోవ ప్రక్కన అతని గాడిదయు సింహమును నిలిచి యుండగా, అతడు చంపబడియున్నట్టు కన్పించాడు. ఈ చర్య ద్వారా ఒక సత్యం ప్రకటింపబడింది: దేవుని వాక్యాన్ని అనుసరించాలి. ఒక ప్రవక్త సహితం దేవుని చిత్తానికి లోబడకుంటే క్షమాపణ ఉండదు. తన ఆదేశాలు పాలింపబడాలని ఆయన ఉద్దేశించింది అపార్థం చేసికొనకుండ దేవుడు చేశాడు. యరొబాముకును, తక్కినవారందరికిని ఈ ప్రవక్త యొక్క మరణము "సుగోచరమైన పాఠంగా" ఉండ నుద్దేశింపబడింది. ప్రవక్త చంపబడినదానిచే యరొబాము ఏ మేరకు ప్రభావితం చేయబడ్డాడో తెలిసికొనడానికి మనకు ఏ సూచనా లేదు.

**బాధతో కూడిన తీవ్ర దుఃఖం ద్వారా**

తప్పు అని చేసే మూడవ ఆక్షేపణ వచ్చింది. యరోబాముకు ఒక కుమారుడు ఉన్నాడు (14:1–20). నీతిమంతుడైన ఏలీకి భక్తిహీనులైన కుమారులుండగా (1 సమూయేలు 2:11–17), దుష్టుడైన యరోబాముకు – దైవభక్తిగల కుమారుడున్నాడు. అతని కుమారుని పేరు అబీయా. ఒక రోజు అతని కుమారుడు బహుగా కాయలాపడ్డాడు (రోగియయ్యాడు). నిరాశలో, తన కుమారుని గతి ఏమి కాబోతుందో అడగడానికి యరోబాము తన భార్యను మారువేషముతో ప్రవక్తయైన అహీయా యొద్దకు పంపుతాడు. అలాగే ఆమె మారువేషం వేసికొని పది రొట్టెలు, కొన్ని అప్పములు, కొంత తేనె తీసికొని ప్రవక్త యొద్దకు వెళ్లింది. అహీయా వృద్ధాప్యంచేత గుడ్డివాడై షిలోహులో నివాసం చేస్తున్నాడు. యరోబాము భార్య సమీపమునకు వస్తుండగా, తన యొద్దకు వస్తుందెవరో, ఆమెతో ఏమి చెప్పాలో అతనికి బయలుపరచబడింది. "యరోబాము భార్యా, లోపలికి రమ్ము; నీవు వేషము వేసికొని వచ్చుటయేల? కఠినమైన మాటలు నీకు చెప్పవలెనని నాకు ఆజ్ఞయాయెను" (అని అహీయా) అన్నాడు (14:6). వణకుతూ, భయపడుతూ ఆమె దగ్గరకు రాగా, తాను యింటికి వెళ్లునంతలో తన కుమారుడు చచ్చునని ఆమెకు చెప్పబడింది. బాలుని మరణం తీర్పును వ్యక్తపరచింది కాదు. తీర్పు అనేది తరువాత వ్యక్తపరచబడింది. వాని మరణము కనికరము చూపు కార్యమైయుంది:

> అతని నిమిత్తము ఇశ్రాయేలువారందరు అంగలార్చుచు, సమాధిలో అతనిని పెట్టుదురు; ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా యరోబాము సంబంధులలో ఇతనియందు మాత్రమే అనుకూలమైన దాని కనుగొనెను గనుక యరోబాము సంతతివారిలో ఇతడు మాత్రమే సమాధికి వచ్చును (14:13).

John C. Whitcomb యిలా రాశాడు,

> ఈ బాలుని ఘనపరచే దేవుని విధానం ఏమంటే వ్యాధిలో చనిపోవ అనుమతించడం మరియు సమాధిలో పాతిపెట్టబడనీయ్యడం! ... రాజు కుటుంబానికి భయంకరమైన తీర్పు వేచియుంది (1 రాజులు 14:10, 11). దానినుండి తప్పించుకొనడానికి – పడకలో చావనియ్యడం మహా గొప్ప దీవెనయైయుంది![3]

యరోబాము కుటుంబమంతటిని నశింపజేయడానికి ఒక రాజు లేస్తాడనియు, తన యింటిలోని పురుషులందరు బలత్కారమైన చావు చస్తారనియు యరోబాము భార్యకు చెప్పబడింది. యరోబాముపై తీర్పును వ్యక్తపరచిన దేవుని విధానమది. అష్షూరు చెరకు సంబంధించిన తొలి ప్రవచనాన్ని ప్రస్తావించుతూ అహీయా తీర్పును గూర్చిన తన ప్రకటనను ముగిస్తాడు (14:15, 16). వారు ఎన్నడూ మారుమనస్సు పొందలేని పాపకూపపు మార్గంలో యరోబాము తన ప్రజలను నడుపసాగాడు. గనుక ఆ దేశము ఒకనాడు తన సొంత పాపాన్నిబట్టి నాశనం చేయబడుతుందని దాని తొలి రాజు కాలంలోనే ప్రకటింపబడింది.

> "ఇశ్రాయేలువారు దేవతాస్తంభములను నిలిపి యెహోవాకు కోపము పుట్టించియున్నారు గనుక నీటియందు రెల్లు అల్లలాడునట్లు యెహోవా ఇశ్రాయేలువారిని మొత్తి, ఒకడు వేరును పెల్లగించినట్లు వారి పితరులకు తాను ఇచ్చిన యీ మంచి దేశములోనుండి వారిని పెల్లగించి వారిని యూఫ్రటీసునది అవతలకు చెదరగొట్టును. మరియు తానే పాపముచేసి ఇశ్రాయేలువారు పాపము చేయుటకై కారకుడైన యరోబాము పాపములనుబట్టి ఆయన ఇశ్రాయేలువారిని అప్పగింపబోవుచున్నాడు" (14:15, 16).

యరోబాము యొక్క దుష్టత్వమందు ఆ స్త్రీయు చేరికయైయున్నందున, ఆ బిడ్డ యొక్క మరణానికి సంబంధించిన ప్రత్యేకమైన ఆదేశములు యివ్వబడ్డాయి.

> "కాబట్టి నీవు లేచి నీ యింటికి పొమ్ము, నీ పాదములు పట్టణములో ప్రవేశించునప్పుడే నీ బిడ్డ చనిపోవును; అతని నిమిత్తము ఇశ్రాయేలు వారందరు అంగలార్చుచు, సమాధిలో అతనిని పెట్టుదురు; ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా యరోబాము సంబంధులలో ఇతనియందు మాత్రమే అనుకూలమైన దాని కనుగొనెను గనుక యరోబాము సంతతివారిలో ఇతడు మాత్రమే సమాధికి వచ్చును" (14:12-13).

ఆ స్త్రీ మనస్సులో ఏయే ఆలోచనలు మెదిలాయో నీవు ఊహించగలవా? తాను యింటికి చేరేసరికి తన కుమారుడు చనిపోతాడని ఆమెకు తెలుసు. ఇంటికి వెళ్లి తన కుమారుని ప్రాణాన్ని కాపాడుకోవాలని నిశ్చయంతో ఉద్దేశించియుంటుంది. ఇకను ఏ దారి కన్పించదు. ఏమి చేయాలో తోచక తికమకగా తన ఆలోచనలు తిరుగుతూ ఉండవచ్చు. చివరిగా, మార్చనొల్లని దేవుని తీర్పును ఎదుర్కొనడానికి ఆమె వెళ్లిపోయింది. ఆయన తీర్పులు నిశ్చయమైనవియు నిలకడగా ఉండునవైయున్నాయి; ఎవడును దానిని ప్రక్కకు నెట్టివేయలేడు – ఆమె తల్లియైనా సరే. ఆమె యింటికి చేరేసరికి, కుమారుడు చనిపోయి ఉన్నాడు. దేవుడు ఎంత స్పష్టంగా చేయగలవాడైయున్నాడో? యరోబాము పాపముపై ఆయన తీర్పులు ముమ్మారు ప్రకటింపబడ్డాయి. మారుమనస్సు పొందాలనే విషయాన్ని యరోబాము నేర్చుకున్నాడా? లేదు. అతడు తన పాపపు మార్గాల్లోనే కొనసాగాడు.

యరోబాము పాపానికి సంబంధించిన శిక్షావిధియొక్క చివరి సందేశమియ్యబడింది – యరోబాము మరణం. తన హెచ్చరికలను ఆలకించాలని దేవుడు ఎదురు చూస్తాడు. చివరిగా, ఆయనను సేవించే అవకాశమో లేక మన పతనాల విషయంలో మారుమనస్సు పొందే అవకాశమో గతించిపోతుంది. యరోబాము చనిపోయినప్పుడు ఏమి జరిగిందో మనకు చూపడానికి దృశ్యాల వెనుకకు పరిశుద్ధాత్మ మనలను తీసికొని వెళ్లతాడు. "... యెహోవా అతని మొత్తినందుచేత అతడు మరణమొందెను" (2 దినవృత్తాంతములు 13:20బి; నొక్కి పలికింది నాది). అతడు సహజమైన మరణం పొందలేదు. అతని 22 సంవత్సరాల కాలపు ఏలుబడి అంతరించింది. తన తీర్పు హస్తాన్ని దేవుడు అతని మీద ఉంచి అతనికి మరణాన్ని తెచ్చాడు. దేవునికి అవిధేయతలో – అతని ఏలుబడి ఎలా ఆరంభమయ్యిందో అది అలాగే అంతమయ్యింది. యరోబాము ఎన్నడూ మారుమనస్సు పొందలేదు. ప్రజలను స్వీకరించడంలోను, నమ్మికలోను, తప్పులో జీవించడంలోను అతడు తన జీవితాన్ని గడిపాడేగాని, దేవుని సత్యంలో కాదు.

# ముగింపు

ఈ సంభవాల్లో మనకేదైనా వర్తింపు ఉంటుందా? తప్పకుండ. "దేవుడు విధేయతను కోరుతున్నాడని" ఈ దైవికమైన వర్ణనలు ప్రకటిస్తున్నాయి! దేవునికి బదులు తనను సేవించుకునే విధానంతోను అవిధేయతతో కూడిన జీవితం మేలు చేయదని యరోబామును గూర్చి చదివిన తరువాత ఒప్పింపబడనివాడెవడు? యరోబాముచే మత్తయి 7:22, 23లోని ప్రభువువారి మాటలు గుర్తు చేయబడతాయి:

> ఆ దినమందు అనేకులు నన్ను చూచి, "ప్రభువా, ప్రభువా, మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములను వెళ్లగొట్టలేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా?" అని చెప్పుదురు. అప్పుడు "నేను మిమ్మును ఎన్నడును ఎరుగను; అక్రమము చేయువారలారా, నాయొద్దనుండి పొండని వారితో చెప్పుదును."

మతము చాలదు! యరోబాముకు మతముంది, కాని తప్పుడు మతం. దేవుని ఆనందింపజేయడానికి కేవలం మతముంటేనే సరిపోయినట్టయితే, యరోబాము దేవుని అంగీకారాన్ని పొందేవాడే. నీకు ఒక మతముండాలని దేవుడు కోరడు; తనయందలి భక్తి నీకు ఉండాలని ఆయన కోరతాడు. ఈ పాఠాన్ని యరోబాము ఎన్నడూ నేర్చుకోలేక పోయాడు. అతడు తన జీవితాన్ని మత సంబంధమైన పాపియైన రాజుగా గడిపాడు.

"యరోబాము ఎందుకు మారుమనస్సు పొందలేదో వింతగా ఉంది. తమ పాపమును గూర్చి బహిరంగంగానే గద్దింపబడ్డాడు. తన్ను హెచ్చరించిన ప్రవక్త దేవునికి అవిధేయుడైనందున చంపబడ్డాడు గదా. యరోబాముకున్న మంచి కుమారుడు కూడ చనిపోయాడు. మరియు తన పాపమునుబట్టి తన యింటనున్న పురుషులందరు బహు ఘోరమైన చావు చస్తారని అతనికి చెప్పబడింది. వారి అంతః కలహానికి ముందు దక్షిణ రాజ్యపు రాజైన అబీయాచే అతడు గద్దింపబడ్డాడు (2 దినవృత్తాంతములు 13:4-12); అయినా అతడు ఎన్నడూ మారుమనస్సు పొందలేదు. దేవుని గద్దింపును అతడెన్నడు హృదయానికి తీసికోలేదు. అది బహు ఆశ్చర్యంగా ఉంది" అని నీవు అనవచ్చు.

ఆగి ఆలోచన చేయి. నేడు మనం చూస్తున్న దానికంటె యిది ఏ మాత్రమైన ఎక్కువ వింతగా ఉందా? మనం ఆయన యెదుట ఎలా జీవించాలి, ఆయనను ఎలా ఆరాధించాలి అనే సంగతులు క్రొత్త నిబంధనలో స్పష్టంగా వివరించబడ్డాయి; అయినప్పటికి, అనేక మతశాఖలు స్థాపింపబడుతునే ఉన్నాయి, వాటిలో ఏవియు క్రొత్త నిబంధనలో కన్పించవు. మనం విశ్వాసంతో (యోహాను 8:24), మారుమనస్సుతో (లూకా 13:3), యేసును ఒప్పుకొనుటతో (రోమా 10:10), క్రీస్తులోనికి బాప్తిస్మంతో ఆయన సన్నిధికి రావాలని మనకు మాటి మాటికి చెప్పబడింది (రోమా 6:3); అయినప్పటికిని నవీన యరోబాములు దేవుని యొద్దకు రావడానికి తమ సొంత ప్లానుతో వస్తారు. ఆయన వాక్య పఠనం (అపొస్తలుల కార్యములు 17:11), పాడుట (ఎఫెసీయులకు 5:19), ప్రార్థన (1 థెస్సలొనీకయులకు 5:17), ప్రతి ప్రభువు దినాన ప్రభురాత్రి భోజనంలో పాల్గొనుట (అపొస్తలుల కార్యములు 20:7; 1 కొరింథీయులకు 11:20, 21), వారములో మొదటి దినాన మనం వర్ధిల్లినకొలది కొంత సొమ్ము సమర్పించుటవలన

ఆయనను ఆరాధించాలని దేవుడు మనకు చెప్పియుండలేదా (1 కొరింథీయులకు 16:1, 2)? అయినా, నరుడు దేవుని మతానికి రూపు మార్చాడు. అతని యిష్టాయిష్టాలను అందులో చొప్పించాడు.

వినయంతో లోబడడం ఎక్కడికి పోయింది? అవసరమైన విధేయతను మనం నేర్చుకుంటామా – లేక మనం ఇరవైయ్యవ శతాబ్దపు యరోబాములమైయుంటామా?

**నేర్చుకోవలసిన పాఠం:**
**నరుని మతము దేవునిచే నిరాకరింపబడింది**
**గనుక అది మనుష్యునిచేత కూడ నిరాకరింపబడాలి.**

---

సూచనలు

[1]Adolf Hitler (1889–1945), జర్మనీ దేశపు నాజీ నియంత, మరియు జోసెఫ్ స్టాలిన్ (1879–1953), సోవియట్ యూనియన్ నాయకుడు – ఉదాహరణలైయుంటారు. [2]1 రాజులు 14:20 చూడు. [3]John C. Whitcomb, *A History of Israel* (Grand Rapids, Mich.: Baker Book House, 1971), 362.